క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక కదిరిరోడ్డులోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీలో ఆదివారం సప్తగిరి హాస్పిటల్స్, బెంగళూరు వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్‌విషర్స్ సేవా సంస్థ నిర్వాహకులు గిరీష్ తెలిపారు. శిబిరంలో గుండె జబ్బులు, న్యూరో సర్జరీ, కిడ్నీ స్టోన్, క్యాన్సర్‌కు సంబంధించిన జబ్బులకు వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దాడి ఘటనపై కేసు

మదనపల్లె : మద్యం మత్తులో గొడవ పడి ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ ఇనయతుల్లా తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని మిషన్‌కాంపౌండ్ సమీపంలోని రాయల్ బార్ ఎదుట మోతీనగర్‌కు చెందిన ఏ.ఉమాశంకర్‌రెడ్డి(39), పెద్దమహేష్, సాయిల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో పెద్దమహేష్, సాయిలు, ఉమాశంకర్‌రెడ్డిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో ఉమాశంకరరెడ్డి తలకు తీవ్రగాయం కాగా, స్థానికులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

తంబళ్లపల్లె: పేకాట ఆడుతున్న ముగ్గురుని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆర్‌ఎస్‌తండా సమీప ప్రాంతంలో పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న ఎస్‌ఐ సిబ్బందితో దాడి చేశారు. ఇద్దరు పారిపోగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.5520లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గాయత్రి శనివారం తెలిపారు. వివరాలిలా.. స్థానిక మండల కేంద్రం పీటీఎం రోడ్డుపై వాహనాల తనిఖీ చేస్తుండగా ఒక ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యం తల్లిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సత్యసాయి జిల్లా కదిరికి చెందిన అన్సర్ బాషా(18), ఇలియాజ్(22)లను అరెస్ట్ చేసి 288 ప్యాకెట్ల మద్యంతో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు.

మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్ర బాబు శనివారం పేర్కొన్నారు. టి.సదుం గ్రామానికి చెందిన రామచంద్ర (45) వద్ద 25 ప్యాకెట్లు, కార్తీక్ (36) వద్ద నుంచి 24 మద్యం ప్యాకెట్లు పట్టుబడటంతో వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి సదుం పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్ర బాబు పేర్కొన్నారు.

ఈవీఎంలపై వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాల్మీకిపురం: మండలంలోని నగిరిమడుగు పంచాయతీలో శనివారం అధికారులు ఈవీఎంల వినియోగంపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఏఈ కమలాకర్ ఎలక్ట్రానిక్ యంత్రంపై ఓటు వేసే విధానంపై గ్రామస్థులకు తెలిజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వచ్చిన అనుమానాలపై నివృత్తి చేశారు.

20న మండల మీట్

బి.కొత్తకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య శనివారం తెలిపారు. ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నాటుసారా ఊట ధ్వంసం

తంబళ్లపల్లె: నాటు సారా తయారీ స్థావరాలపై కార్డన్‌సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా శనివారం దాడులు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆర్‌ఎస్ తండా సమీప గుట్టలో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసి 600లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు.

విషాహారం తిని కోళ్లు మృతి

ములకలచెరువు: విషాహారం తినడంతో కోళ్లు మృతి చెందిన సంఘటన శనివారం మండలం సరిహద్దుల్లో చోటుచేసుకుంది. బాధితురాలు శంషాద్‌బి కథనం మేరకు.. ములకలచెరువు మండలం చౌడసముద్రంకు చెందిన శంషాద్‌బి తంబళ్లపల్లి మండలం పెద్దేరు ప్రాజెక్టు సమీపంలో వ్యవసాయం చేస్తూ కోళ్ల పెంపకం, గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. పనులమీద ఆమె భర్త బాబ్జాన్‌తో కలిసి చౌడసముద్రంకు వెళ్ళింది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు బియ్యంలో విషం గుళికలు కలిపి కోళ్లకు పెట్టారు. విషాహారం తిని సుమారు 30 కోళ్లు మృతి చెందాయి. ఈ సంఘటనపై పోలీసులు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

యథావిధిగా అంగన్‌వాడీ కార్యకలాపాలు

పౌష్టికాహారం అందిస్తున్న అధికారులు



సంగసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మధ్యాహ్న భోజనం వడ్డించిన సచివాలయ ఉద్యోగి



తరిగొండ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న అధికారులు

గుర్రంకొండ: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు తరలివస్తున్నారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు అధికారులు పౌష్టికాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందించారు. గత శుక్రవారం అధికారులు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు తెరిపించిన విషయం తెలిసిందే. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ ఒక సచివాలయ ఉద్యోగిని నియమించి నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయాన్నే యథావిధిగా కేంద్రాలు తెరుచుకొన్నాయి. సచివాలయ ఉద్యోగులు వారికి కేటాయించిన కేంద్రాలకు వెళ్లి విధుల్లో చేరారు. గ్రామాల్లోని వలంటీర్లు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు వద్దకు తీసుకొచ్చారు. పలు కేంద్రాల్లో చిన్నారులకు సచివాలయ ఉద్యోగులు విద్యా బుద్ధులు నేర్పించారు. కొన్ని కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు బాలమృతంతో పాటు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం కేంద్రాలకు వచ్చిన చిన్నారులకు రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. వరుసగా రెండవ రోజు కూడా దిగ్విజయంగా అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకొని తమ కార్యకలాపాలను కొనసాగించడం గమనార్హం. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, పంచాయతీ కార్యదర్శులు కల్యాణీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

గుర్రంకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్లో రౌడీషీటర్లకు, రౌడీలకు, గంజాయి ముఠాసభ్యులకు శనివారం రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దౌర్జన్యాలకు దిగడం చట్టరీత్యా నేరమన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్నారు. ప్రశాంత జీవనానికి అలవాటు పడి నేరాలకు దూరంగా ఉండాలన్నారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఎన్నికల సమీపిస్తున్నందున గ్రామాల్లో పోలీసుల నిఘా ఉంటుందన్నారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. గంజాయి తాగడం మానితే మనిషి ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. సమాజంలో యువత వీటికి అలవాటు కావడం బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవడమే కాకుండా ఎన్నో అనర్థాలు జరుగుతాయన్నారు. నాటుసారా విక్రయాలకు అలవాటు పడిన వారు ఇకనైనా వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దిలీప్‌కుమార్, ఏఎస్‌ఐ నరసింహులు, హెడ్‌కానిస్టేబుళ్లు రమణ, నాగరాజు, జగదీష్, శివప్రసాద్ పాల్గొన్నారు.

సాధన పాఠశాలకు ఎక్సెలెన్సీ అవార్డు

పీలేరు రూరల్ : పీలేరు సాధన పాఠశాలకు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక ఎక్సెలెన్సీ అవార్డు లభించింది. పాఠశాల కరస్పాండెంట్ వినూతరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా బ్రెయిన్ ఫీడ్ మ్యాగ్‌జైన్ వారు దేశవ్యాప్తంగా విద్యారంగంలో విశిష్ట సేలందించే పాఠశాలలను ఎంపిక చేసి అవార్డులు ఇస్తారన్నారు. ఇందులో భాగంగా తమ పాఠశాలకు ఈ నెల 15న హైదరాబాద్ హైటెక్‌సిటీలో ఎగ్జిబిషన్ హాల్-2లో జరిగిన బహుమతుల ప్రదానోత్సంలో అవార్డు అందించారని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో తమ పాఠశాలకు అవారు అందడం తమకు మరింత బాధ్యత పెంచిందని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా మహమ్మద్‌జాఫర్



కలకడ : వైఎస్సార్ సీపీ ప్రకటించిన జిల్లా అనుబంధ విభాగాలలో స్టూడెంట్ వింగ్ జిల్లా కార్యదర్శిగా కలకడ టౌన్‌కు చెందిన షేక్.మహమ్మద్‌జాఫర్‌ను ఎంపిక చేయడంపై స్థానిక ముస్లిం సోదరులు ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ ఆర్భావం నుంచి విద్యార్థి విభాగంలో ఉన్న మహమ్మద్‌జాఫర్‌ను శనివారం ప్రకటించిన జాబితాలో జిల్లా కార్యదర్శిగా నియమించడంపై పలువురు అభినందనలు తెలిపారు.

నిమ్మనపల్లె హెడ్‌కానిస్టేబుల్‌కు సిల్వర్ మెడల్

నిమ్మనపల్లె : మండల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మిరియాల శివరామకృష్ణ శనివారం డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి నుంచి సిల్వర్‌మెడల్ అందుకున్నారు. విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో డీజీపీ రాజేంద్రనాథ్ సిల్వర్‌మెడల్ అందజేసి అభినందనలు తెలిపారు. విధుల్లో అంకితభావం కనపరచడం, సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చొరవ చూపడం తదితర సేవలపై శివరామకృష్ణకు అవార్డును వరించింది. అవార్డు అందుకున్న హెడ్‌కానిస్టేబుల్‌ను రూరల్ సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది అభినందించారు.

ఎమ్మెల్సీ సాబ్జికి కొవ్వొత్తులతో నివాళి

పీలేరు రూరల్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ సాబ్జికి శనివారం సాయంత్రి స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాబ్జి మృతి చెందడం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, ట్రెజరర్ చంద్రశేఖర్, కార్యదర్శి అక్రంబాషా, జిల్లా మాజీ గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ, నాయకులు వెంకటరమణ, విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్, రమేష్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, చెంగారడ్డి పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వాల్మీకిపురం: వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దెల రవీంద్ర అన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, గ్రామల అభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు పట్టదని, కేవలం దోచుకోవడం, పంచుకోవడమే వారి విధానమన్నారు. పొరపాటున కూడా చంద్రబాబు ప్రభుత్వం వస్తే వలంటీర్, సచివాలయం, ఆర్‌బీకే వ్యవస్థలను రద్దు చేస్తారన్నారు. ఇంటి వద్దకే అందిస్తున్న రేషన్, పింఛన్, వైద్యం లేకుండా చేస్తారని, నాడు-నేడు పథకంలో అన్ని హంగులతో నాణ్యమైన విద్యను అందిస్తున్న బడులను మూసివేస్తారని తెలిపారు. చివరకు రాష్ట్రంలో వర్షాలు కూడా పడే పరిస్థితి ఉండదని, లోకేష్ పాదయాత్ర చేసిన ప్రాంతాల్లో వర్షాలు లేకుండా పోవడం గమనార్హం అన్నారు. పీలేరు నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని, రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించి రికార్డును సృష్టించబోతున్నట్లు తెలిపారు. వలస పక్షిగా నియోజకవర్గాన్ని విజిట్ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. దొంగ ఓట్లతో గెలిచే సంస్కృతి టీడీపీదేనని, చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో 40వేలకు పైగా కర్ణాటక వాసులను దొంగ ఓటర్లుగా చేర్పించి గెలుస్తూ వచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిభాస్కర్, నాయకులు రవీందారెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, నరసింహులు, చిన్నోడు, బుడ్డయ్య, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలంలో రూ.10.50 లక్షల ఆదాయం



కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

మదనపల్లె : అక్రమ మద్యం రవాణాలో ఎస్‌ఈబీ అధికారులు సీజ్‌చేసిన వాహనాలను వేలం వేయగా ప్రభుత్వానికి రూ.10.50 లక్షల ఆదాయం సమకూరినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాస్, ఏఈఎస్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌ఈబీ పోలీస్ స్టేషన్ ఆవరణలో 36 వాహనాలు వేలం వేశామన్నారు. అందులో 30 వాహనాలను వేలంలో పాటదారులు కొనుగోలు చేశారన్నారు. అనంతరం పలుకేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం, నాటుసారాను ధ్వంసం చేశారు. మొత్తం 50 నాటుసారా కేసుల్లో రూ.2.40 లక్షల విలువైన 1,617 లీటర్ల నాటుసారా, 84 కర్నాటక మద్యం కేసుల్లో రూ.6.50లక్షల విలువైన 1,920 లీటర్ల కర్నాటక మద్యాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేళకు బస్సులు నడపాలి

మదనపల్లె సిటీ: బస్సులను వేళకు నడపాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరిగింది. పలువురు ఫోన్‌ల ద్వారా డీఎంకు ఫిర్యాదులు చేశారు. సమయానికి బస్సులు నడపడం లేదని, స్టాపింగ్‌లలో బస్సులు ఆడగడం లేదని ఫిర్యాదులు చేశారు. దీనిపై డీఎం మాట్లాడుతూ సిబ్బందికి సమావేశం నిర్వహించి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు క్యాష్ అవార్డులు

స్థానిక టు డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. కెఎంపిఎల్, ఈపీకే అధికంగా సాధించిన సిబ్బందికి క్యాష్ అవార్డులు అందజేశారు. డీఎం ఆర్‌సి నిరంజన్, సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను టీవీలకు దూరంగా ఉంచండి

కలకడ : విద్యార్థులను టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచి, విద్యాప్రమాణాలు పెంచే విధంగా చూడాలని తల్లిదండ్రులను ప్రధానోపాధ్యాయులు చెంగల్‌రాయుడు, సరస్వతిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని కలకడ, కోన ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 10వతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి పరీక్షల వరకూ విద్యార్థులను విద్య కోసమే కేటాయించాలని, ఇతర పనులు చేయించరాదని తెలిపారు.

రెవెన్యూ అధికారుల అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

కేవీపల్లె : కేవీపల్లె మండలంలో రెవెన్యూ అధికారుల అవినీతిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్‌కార్యాలయంలో లంచం ఇవ్వకుంటే ఏ పని జరగడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలపై దళితసంఘ నాయకుడు ముల్లంగి చంద్రయ్య అధికారులను ప్రశ్నించడంతో ఆయనపై తహసీల్దార్ అక్రమ కేసు పెట్టారన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముల్లంగి చంద్రయ్య, సుధాకర్‌బీబు, గుర్రం నారాయణ, పి.వి. రమణ, రామాంజులు, పురుషోత్తం, సురేష్, ఆంజినేయులు, ప్రసాద్, మల్లికార్జున, ప్రసాద్, తిమ్మయ్య, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పార్శిల్ సర్వీస్ కేంద్రాల్లో తనిఖీలు

పీలేరు : గంజాయి అక్రమ రవాణా నివారణపై ముందస్తు చర్యల్లో భాగంగా పీలేరు పట్టణంలో ముమ్మర తనిఖీలు చేశారు. శనివారం సెబ్ ట్రైనీ అసిస్టెంట్ సూపరింటిండెంట్ బి. వినోద్‌కుమార్, ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్, ఏపీఎస్ ఆర్టీసీ కొరియర్ సర్వీస్, డీటీడీసీ, వీఆర్‌ఎల్, నవత, ఎస్‌డీఆర్‌ఎల్, క్రాంతి, ఎస్ఆర్‌ఎస్‌ఎంటీ, గరుడ, ఇంద్ర, హెచ్‌ఎంటీ పార్శిల్ సర్వీసులలో తనిఖీలు చేశారు. పార్శిళ్లకు సంబంధించిన డాక్యుమెంట్స్, గూడ్స్ డిక్లరేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే అనుమతించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు లేవని నిర్ధారణకు వచ్చాకే డెలివరీ చేయాలని సూచించారు.

రూ.10 లక్షలతో కాలువల నిర్మాణం

పీలేరు : పట్టణ పరిధిలో కొత్తగా రూ. 10 లక్షలతో మురుగునీటి కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.వి. రాకేష్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక సైనిక్‌నగర్‌లో మురుగునీటి కాలువ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులతో కొత్తగా 1500 మీటర్ల మురుగునీటి కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఉదయ్‌కుమార్, నరేష్ రామ్‌కుమార్‌రెడ్డి, ఈవో ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పథకాలు చేరాలన్నదే లక్ష్యం

మదనపల్లె : సమాజంలోని ప్రతి వర్గానికి కేంద్ర పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు కొత్తవారి పల్లె సర్పంచ్ మహేష్‌బాబు, ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని కొత్తవారి పల్లెలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర రథం పర్యటించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌నాయక్, సచివాలయ సిబ్బంది తదితరులు రథానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఆర్థికస్వావలంబన సాధించాలన్న ప్రధాని మోదీ లక్ష్యం మేరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివక్షకు తావు లేకుండా సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదంతో 2047లోపు భారత్‌ను బాగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రధాని విశేషకృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా నవభారత నిర్మాణంలో అమృతకాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఔన్నత్యంపై ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా అందించిన సందేశాన్ని ప్రజలు తిలకించారు. సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. ఉజ్వల పథకం కింద గ్యాస్‌స్టవ్‌లు పంపిణీ చేశారు. పోషణఅభియాన్‌లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్, వైద్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, ఆయుష్మాన్‌భారత్ కార్డుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ నాగప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం, తుమ్మరకుంట గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు శారద, పీఎస్ మధు, జయలలిత, లోకేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నిమ్మనపల్లె : ఈనెల 18 నుంచి మండలంలో నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...కేంద్రప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన, లబ్ధిదారులతో మాటామంతీకై వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.